
సాక్షి జనగామ

బుధవారం | 9 | ఏప్రిల్ | 2025



నిఘా నీడలో మూల్యాంకనం

టెన్త్ విద్యార్థుల పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం అధికారులు సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తున్నారు. - 8లో▸



కబ్జా నిరూపిస్తే రాజీనామా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడైనా ఒక గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

$38^0/22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చిల్పూరు ఆలయంలో భక్తుల తాకిడి



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్ రావుల ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంను అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారి ముందు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మీ, వసంత, గాదె శేఖర్, స్వరూప, మహేష్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

12న వీర హనుమాన్ విజయయాత్ర



జనగామ రూరల్: ఈనెల 12న నిర్వహించనున్న వీర హనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ అన్నారు. మంగళవారం పట్టణంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు వైభవంగా జరుగనున్న యాత్రకు ప్రజలు, భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌కృష్ణ భార్గవ, ఉపాధ్యక్షులు బచ్చు బాలనారాయణ, కార్యదర్శులు చిలువేరు హర్షవర్ధన్, మాసరాజు, సభ్యులు కుమారస్వామి, లక్ష్మణ్ శివరామ్, రాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు



జనగామ: ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాల్లో భాగంతో మంగళవారం వరంగల్‌లో జరిగిన వేడుకల్లో జనగామ డిపోకు చెందిన నలుగురు ఉద్యోగులకు రీజియన్ అవార్డ్స్ అందుకున్నట్లు డిపో మేనేజర్ స్వాతి మంగళవారం తెలిపారు. ఇంధన పొదుపులో డ్రైవర్లు టి.ఎస్. నారాయణ, ఎండీ అయూబ్ ఖాన్, అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కేటగిరీలో కండక్టర్ బాబురావు, శ్రామిక్ ఎం.శ్రీనివాస్ నలుగురు ఉద్యోగులు రీజనల్ మేనేజర్ డి.విజయ భాను చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, నగదు అవార్డ్స్ అందుకున్నట్లు డీఎం తెలిపారు.

108 పైలట్లకు ఉత్తమ అవార్డు



జనగామ రూరల్: జిల్లాలో 108 వాహనంలో పనిచేసే కె.రాజన్న, జి.అనిల్ పైలట్లు మంగళవారం ఉత్తమ స్టార్ అవార్డు అందుకున్నారు. అంబులెన్స్‌లో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి చేరుస్తూ, వాహనానికి సకాలంలో మరమ్మతులు, షెడ్యూల్ సర్వీస్, డీసెల్ టాపప్, ఎయిర్ చెకింగ్ చేయిస్తూ, వాహనానికి మంచి మైలేజి తెచ్చినందుకు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్, జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్ చేతుల మీదుగా స్టార్ అవార్డును అందించారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

జనగామ రూరల్: పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. మంగళవారం ధరల పెంపుకు నిరసనగా పట్టణ కేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, బూడిది గోపి, భూక్య చందు నాయక్, కళ్యాణం లింగం, లలిత, శ్రావణ్, బీరయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

‘పీఎంశ్రీ’ పాఠశాలలకు నిధులు

- జిల్లాలో 15 స్కూళ్లలో 2,650 మంది విద్యార్థులు
- శానిటరీ నాప్కిన్స్, స్పోర్ట్స్ సామగ్రికి బడ్జెట్
- గత సంవత్సరం యూనిఫాం స్టిచింగ్ కూలి విడుదల
- భవిత సెంటర్లకు రూ.6 లక్షలు



భవిత సెంటర్‌లో పిల్లలు



యూనిఫాం కొలతలు తీసుకుంటున్న మహిళా సంఘాల ప్రతినిధులు



జనగామ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాశాఖకు నిధుల వరద కురిపించాయి. పీఎంశ్రీ, భవిత సెంటర్లు, బాలికలకు శానిటరీ నాప్కిన్స్, యూనిఫాం స్టిచింగ్, క్రీడా సామగ్రి కొనుగోలుకు రూ.37.93 లక్షల మేర నిధులు విడుదల చేసింది. నిధుల ఖర్చుకు సంబంధించి ఉత్తర్వుల కాపీలో పేర్కొనగా.. నిబంధనలను అనుసరించి మెటీరియల్ కొనుగోలు చేయనున్నారు.

పీఎంశ్రీలో 15 పాఠశాలలు..

జిల్లాలో పీఎంశ్రీ(స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 5 మోడల్, ఒక సోషల్ వెల్ఫేర్ (జఫర్‌గఢ్), యూఆర్‌ఎస్, 8 ఉన్నత పాఠశాలలు (జెడ్పీఎస్ఎస్) ఉన్నాయి. ఇందులో విద్యను అభ్యసిస్తున్న 2,650 మంది బాలికలకు శానిటరీ నాప్కిన్స్ కొనుగోలుకు రూ.7.95 లక్షల బడ్జెట్ విడుదల చేసింది. ఒక్కో విద్యార్థినికి రూ.300 చొప్పున కేటాయించగా, 50 శానిటరీ నాప్కిన్స్ ఇవ్వాల్సి ఉండగా.. పలు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలుకు ఒక్కో పాఠశాలకు రూ.50వేల చొప్పున రూ.7.50 లక్షలు విడుదల చేసింది. విద్యార్థుల అవసరాలను బట్టి నిబంధనల మేరకు క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం 100 నుంచి 150 రకాల ఆప్షన్ చూపించింది.

యూనిఫాం కూలి డబ్బులు..

జిల్లాలో విద్యార్థులకు రెండు జతల యూనిఫాం స్టిచింగ్‌కు సంబంధించి 2024–25 వార్షిక సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న కూలి వేతనం డబ్బులను సర్కారు విడుదల చేసింది. 32,965 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం ఉచితంగా ఇవ్వగా, స్టిచింగ్ చార్జీల కింద ఒక్కో యూనిఫాంకు స్వయం సహాయక సంఘాలకు రూ.75గా నిర్ణయించింది. ఈ లెక్కన రూ.49.44 లక్షల స్టిచింగ్ చార్జీలకు గాను రూ.32.96లక్షలు గతంలో ఇవ్వగా, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రూ.16.48 లక్షలు విడుదల చేసింది. 2025–26 నూతన విద్యా సంవత్సరంలో 29,158 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాం కోసం ప్రభుత్వం క్లాత్ పంపించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా పర్యవేక్షణలో యూనిఫాంలను స్టిచింగ్ చేయిస్తున్నారు. జూన్ 10వ తేదీ **వరకు** యూనిఫాం అందించాలని **విద్యా**శాఖ అధికారుల **ఆదేశాలు జారీ** చేశారు.

ఒక్కో భవితకేంద్రానికి రూ.2లక్షలు

జిల్లాలో 12 మండ**లాల పరిధిలో** భవిత సెంటర్లు (**ప్రత్యేక అవసరాల** పిల్లల కేంద్రం) ఉ**న్నాయి. ఇందులో మూడు** కేంద్రాలకు పక్కా భవనాలు ఉండగా, 9 సెంటర్లను ఆయా పాఠశాలలకు అనుబంధంగా కొనసాగిస్తున్నారు. సమగ్ర శిక్షణ ప్రాజెక్టు కింద పక్కా భవనాలు ఉన్న జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ భవిత సెంటర్లకు ఒక్కోదానికి రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షలు విడు**దల చేశారు. ప్రత్యేక అవసరాల** పిల్లల కోసం ప్రభుత్వం సూచించిన మేరకు యా టేబుల్, కుర్చీలు, స్పోర్ట్స్ కిట్లు, మానవ శరీర భాగాలు, నిత్యందన జీవితంలో ఉపయోగించే యాప్స్, కూరగాయలు, నంబరింగ్ తదితర పరికరాలను కొనుగోలు చేసి, పిల్లలకు వాటిపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి..



పీఎంశ్రీ పథకంలో ఎంపికైన 15 పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 2,650 మంది బాలికలకు శానిటరీ నాప్కిన్స్ కొనుగోలుకు రూ.7.95 లక్షలు, ఒక్కో పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలుకు రూ.7.50 లక్షల నిధులను విడుదల చేసింది. జిల్లాలోని మూడు భవిత సెంటర్లకు ప్రత్యేక అవసరాల పిల్లల బోధన తరగతులకు అవసరమైన వాటిని కొనుగోలుకు రూ.6 లక్షల బడ్జెట్ వచ్చింది. ఆయా పాఠశాలలు నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- భువనగిరి నర్సింహారావు, సీఎంఓ, జనగామ

ఒక్కో జతకు రూ.75



జిల్లాలో 2024–25 సంవత్సరంలో విద్యార్థులకు రెండు జతల యూనిఫాం ఇవ్వగా, మహిళా సంఘాలకు స్టిచింగ్ చార్జీల కింద ఒక్కో జతకు రూ.75 చొప్పున ఇచ్చారు. ఇందులో రూ.49.44 లక్షలు రావాల్సి ఉండగా, పెండింగ్‌లో ఉన్న రూ.16.48లక్షల నిధులను విడుదల చేసింది.

- పెనుగొండ రమేశ్, ఏపీ ఇన్‌చార్జ్, జనగామ

‘ఎల్‌ఆర్‌ఎస్’ ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



సూచనలు ఇస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్‌ల క్రమబద్ధీకరణ ఆన్‌లైన్ విధానాన్ని పర్యవేక్షించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకొని, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం కింద వచ్చిన దరఖాస్తుదారుల భూముల పరిశీలనను వేగంగా చేపట్టాలని, అభ్యంతరాలు లేని వాటికి త్వరగా ప్రొసిడింగ్స్ జారీ చేయాలన్నారు. ఈ నెలాఖరు వరకు రాయితీ గడువును పెంచినందున దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ కింద పూర్తిస్థాయి రుసుం చెల్లించి, భూముల క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు రేషన్ కార్డు ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎస్సీడీఓ విక్రమ్, బీసీ సంక్షేమ అధికారి రవీందర్, టీపీఎస్ ప్రశాంతి, అధికారులు పాల్గొన్నారు.

పిల్లల మానసిక ఎదుగుదలకు చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న సుధీర్

స్టేషన్‌ఘన్‌పూర్: పిల్లల మానసిక ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్ అన్నారు. రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమంలో భాగంగా కమిషనరేట్ ఫ్యామిలీ వెల్ఫేర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక జెడ్పీఎస్ఎస్‌లోని అంగన్‌వాడీ కేంద్రం–2లో మంగళవారం శిశువుల మానసిక ఎదుగుదల లోపాలను గుర్తించుట, దృష్టి లోపాలను గుర్తించుటకు ఆర్‌బీఎస్‌కే స్టేషన్‌ఘన్‌పూర్ టీం బృందంచే 121 మంది పిల్లలకు నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. పిల్లల మానసిక ఎదుగుదల, దృష్టి లోపాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ అజయ్‌కుమార్, శ్రీనాథ్, ఆఫ్రీన్, మౌనిక, ఏఎన్ఎం రాణి, సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ జరిపించాలి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

జనగామ రూరల్: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీసీఐ, పల్లికాయ కొనుగోలులో జరిగిన అవినీతిపై విచారణ జరపాలన్నారు. సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి ఇవ్వకుండా ఉన్న రైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో ధాన్యం కనీసం మద్దతు ధర రూ.1,850కు కొనుగోలు చేయాలని జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కనీస సౌకర్యాలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని కోరారు. తక్షణమే గత రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్ నిర్వహించి విజిలెన్స్ విచారణ జరిపి అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అజ్మీరా సురేష్ నాయక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగ బీరయ్య, జిల్లా కమిటీ సభ్యులు బోడ రాములు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో పారిశుద్ధ్య పనులు

- పర్యవేక్షించిన ఎమ్మెల్యే పల్లా



చెత్త తొలగిస్తున్న కార్మికులు



బతుకమ్మకుంటలో కమిషనర్‌కు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే

సాక్షి ఎఫెక్ట్..

జనగామ: జనగామ బతుకమ్మ కుంటలో పారిశుద్ధ్య పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. ‘ఆహ్లాదం కరువు’ శీర్షికన గత నెల 28న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు స్పందించారు. సాక్షిలో వచ్చిన కథనం క్లిప్పింగ్‌తో బతుకమ్మకుంట వాకర్స్ అసోసియేషన్, అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కలెక్టర్‌కు మెమోరాండం అందించగా, పలువురు కుంట ప్రాంతంలో నిరసన తెలిపారు. ఈ మేరకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు మసిఉర్ రెహమాన్, అనితతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బతుకమ్మకుంటకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లకు ఫోన్ చేయగా.. శానిటేషన్ కార్మికులతో కలిసి ఆయన అక్కడకు చేరుకున్నారు. వాకర్స్, కుటుంబ సమేతంగా వచ్చే పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్ పులి శేఖర్ ఆధ్వర్యంలో కార్మికులు బతుకమ్మకుంటలోని పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన చెత్తా, చెదారం, మైదానం శుభ్రం చేశారు. వాకర్స్ నడిచే ట్రాక్‌కు రెండు వైపులా ఏపుగా పెరిగిన మొక్కలను తొలగిస్తున్నారు. అలాగే కుంటలోని వాటర్ నుంచి దుర్వాసన వెదజల్లుతుండగా.. అందులోని నాచు, చెత్తను మాత్రమే తీయించనున్నట్లు అధికారులు చెప్పారు. శానిటేషన్ పనులు ప్రారంభం కావడానికి కృషి చేసిన సాక్షికి వాకర్స్, పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కుంట అభివృద్ధికి రూ.1.50 కోట్లు

జనగామ ఐకాన్ బతుకమ్మకుంట అభివృద్ధికి రూ.1.50 కోట్లు నిధులను ఖర్చు చేయనున్నారు. 2015 ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో పాటు పురపాలికకు సంబంధించి 18 బ్యాంకు ఖాతాలను క్లోజ్ చేయగా వచ్చిన డబ్బులతో కుంట అభివృద్ధికి వెచ్చించనున్నారు. కుంటలోని నీటి చుట్టూ రేలింగ్, కలర్ లైటింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు చేయనున్నారు. ఇందుకు సంబంధించి స్పెషల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు నిధులను సమీకరించుకోగా, త్వరలోనే పనుల కోసం టెండర్లను పిలువనున్నట్లు ఏఈ మహిపాల్ మంగళవారం తెలిపారు.

హామీల అమలులో విఫలం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్



జెండా ఆవిష్కరణలో రమేశ్ తదితరులు

జఫర్‌గఢ్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చేసిన ఏ వాగ్దానం కూడా పూర్తి స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్ని విధాల అభివృద్ధి చెందుతోందన్నారు. మండల అధ్యక్షుడు కోరుకొప్పుల గణేష్‌గౌడ్, అంజిరెడ్డి, మదన్‌మోహన్, తౌటి సురేష్‌గౌడ్, గద్దం రాజు, మారపల్లి రవి, మేకల పవన్, సంగా గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బీజేపీ మండలస్థాయి క్రియాశీల సభ్యుల సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణగౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యాసంగి ధాన్యం సేకరణ షురూ

- జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 9963407064



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు

జనగామ రూరల్: యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రేడ్–ఏ రకం (సన్నాలు) ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకం (దొడ్డు) ధాన్యం క్వింటాకు రూ.2,300గా కనీస మద్దతు ధర ప్రకటించాయి. ప్రభుత్వం ప్రకటించిన ధరతో రైతుల నుంచి ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయగా మంగళవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించి అకాల వర్షాల నుంచి తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు.

సన్నాలకు రూ.500 బోనస్

సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. యాసంగిలో 3,75,453 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా అందులో సన్నరకం 1,05,891, దొడ్డు రకం 2,69,562 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరుగా ధాన్యం సేకరించనున్నారు.

టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యల పరిష్కారానికి, ధాన్యం కొనుగోళ్లు, అమ్మకాల్లో రైతులకు సమస్యలు తలెత్తితే ఫిర్యాదు చేసేందుకు జిల్లా యంత్రాంగం టోల్ ఫ్రీ నంబర్ 9963407064 ఏర్పాటు చేసింది.

మిల్లర్లు నిబంధనలు పాటించాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జనగామ మండలం శామీర్‌పేట, వడ్లకొండ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు 17 శాతం తేమతో ధాన్యాన్ని తీసుకువస్తే గిట్టుబాటు ధర వస్తుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మేకల కళింగ రాజు, ప్రేమలత రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి



జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించాలి. జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఐకేపీ 164, పీఏసీఎస్ 134, డీసీఎంఎస్ 2 ఉన్నాయి. రైతుల సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- రోహిత్ సింగ్, అదనపు కలెక్టర్

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలాచారి



లింగాలఘణపురం: విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యుత్ సమస్యలను సిబ్బంది ఏ మేరకు పరిష్కరించారని తెలుసుకున్నారు. 34 ఫిర్యాదులు రాగా అందులో 18 వరకు వెంటనే పరిష్కరించారు. జనగామ డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి, ఏడీఈ అనిల్‌కుమార్, ఏఈలు శంకరయ్య, నర్సింహ్మలు, నర్సింహ్మారెడ్డి, సీజీఆర్‌ఎఫ్ ఏఈ శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మూర్తి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి

జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విజయ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ 4వ జిల్లా మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్వ విద్యాలయాల్లో సంస్కరణల పేరుతో యూజీసీ రూపొందించిన ముసాయిదా అమల్లోకి వస్తే విశ్వవిద్యాలయాలు కేంద్ర ప్రభుత్వం గుప్పిట్లోకి వెల్లుతాయని, రాష్ట్రాల హక్కులను హరించడానికే కేంద్రం ఈ ముసాయిదాను తీసుకువచ్చిందన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం చూపకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, ధర్మభిక్షం, సందీప్, సుమా తదితరులు పాల్గొన్నారు

తహసీల్దార్ల బదిలీ

జనగామ: జిల్లాలో నలుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రిజ్వాన్ బాషా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ ఆర్డీఓ కార్యాలయ డీఏఓ అండాలు దేవరుప్పులకు, అక్కడ పనిచేస్తున్న మహిపాల్‌రెడ్డి తరిగొప్పులకు బదిలీ అయ్యారు. తరిగొప్పుల తహసీల్దార్ నాగేశ్వరాచారి పాలకుర్తికి బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్ జనగామ ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా రానున్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభాస్థలి పరిశీలన



బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం శివారు, చింతలపల్లి గ్రామ సమీపంలోని సుమారు 1200 ఎకరాల్లో ఈనెల 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఆ పార్టీ నేతలు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దాస్యం వినయ్‌భాస్కర్, ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు వేర్వేరుగా సభా స్థలాన్ని పరిశీలించారు. సభా స్థలి ప్రాంగణంలో అక్కడక్కడ కొంత వరిపంట కోతదశలో ఉన్నందున ఆ ప్రాంత్రాన్ని బీఆర్‌ఎస్ నేతలు పరిశీలించారు. మిగతా స్థల ప్రాంగణం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మరో వారం రోజుల్లో సభా స్థలం పనులు పూర్తి కానున్నాయని అంచనా వేశారు. నాయకులు పిట్టల మహేందర్, కడారి రాజు, తంగెడ నగేశ్, దుకిరె రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

దూరవిద్య ఎమ్మెస్సీ సైకాలజీ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రం ఎమ్మెస్సీ సైకాలజీ ఫైనలియర్ విద్యార్థులు, ఎక్స్ అభ్యర్థులకు థియరీ, ప్రాక్టికల్స్, డిప్లొమా ఇన్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పరీక్షలు ఈనెల 24 నుంచి నిర్వహించాల్సిండగా ఆయా పరీక్షలు వాయిదావేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

కూర మాడిపోతుందన్న ఆతృతలో..

- రేకులపై ఉన్న మసిగుడ్డ తీసే క్రమంలో విద్యుదాఘాతం
- అక్కడికక్కడే వివాహిత మృతి
- రాంచంద్రుతండాలో ఘటన



అఖిల(ఫైల్)

చిన్నగూడూరు: కూర మాడిపోతుందన్న ఆతృతలో రేకులపై ఉన్న మసిగుడ్డ తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రం శివారు రాంచంద్రుతండాలో జరిగింది. బాధిత కుటుంబీకులు, స్థానికుల కథనం ప్రకారం..తండాకు చెందిన బాదావత్ అఖిల(25) సోమవారం రాత్రి తన ఇంటిలో వంట చేస్తోంది. ఈ క్రమంలో పొయ్యి మీద కూర మాడిపోతుందన్న ఆతృతలో ఇంటి ఎదుట రేకులపై ఉన్న మసిగుడ్డను తీసే సమయంలో రేకులకు విద్యుత్ సరఫరా అయ్యి షాక్ తగలడంతో కిందపడింది. గమనించిన స్థానికులు రేకులకు విద్యుత్ సరఫరా అవుతున్న వైర్ తొలగించారు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించే క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. ఎస్సై ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు (రిత్విక్ రెండు సంవత్సరాలు, రిద్వాన్ నాలుగు సంవత్సరాలు), భర్త నరేశ్ ఉన్నారు. తల్లి మృతితో గుక్కిపెట్టి ఏడుస్తున్న చిన్నారులను చూసి తండావాసులు కంటతడి పెట్టుకున్నారు. ఈ ఘటనతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నిఘా నీడలో మూల్యాంకనం

- అనారోగ్య కారణాల సాకు చూపి రానివారిని పిలిపించి విధుల అప్పగింత
- జెన్యూన్‌గా ఉన్నవారికే మినహాయింపు
- సెల్‌ఫోన్లు వినియోగిస్తుండగా డీఈఓ గుర్తింపు
- స్పాట్ కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర అబ్జర్వర్

సీసీ కెమెరాల పర్యవేక్షలో 'టెన్త్' వాల్యుయేషన్



విద్యారణ్యపురి: సంవత్సరం పొడవునా కష్టపడి చదివి పరీక్షలు రాసిన విద్యార్థుల భవితవ్యం ఉపాధ్యాయుల మూల్యాంకనం పైనే ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో వారు మూల్యాంకనం సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు సీసీ కెమెరాల నిఘా ద్వారా పర్యవేక్షిస్తున్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో కాజీపేట ఫాతిమాహైస్కూల్ స్పాట్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో టెన్త్ విద్యార్థుల పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం ప్రారంభమైన విషయం విధితమే. ఈస్పాట్ కేంద్రానికి అన్నిసబ్జెక్టులతోపాటు ఒకేషనల్ కోర్సులు జవాబుపత్రాలు కలిపి 2లక్షల 31వేలకుపైగా వచ్చాయి. సీఈలు, ఏఈలు, స్పెషల్ అసిస్టెంట్లు కలిపి 957మందిని ఆరు జిల్లాలు (ఉమ్మడి వరంగల్) హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి నియమించగా అందులో తొలిరోజు 728 మంది విధుల్లో చేరారు. మరికొందరు అనారోగ్యకారణాలు చూపుతూ మెడికల్ రిసిప్ట్‌లతో తమకు స్పాట్‌నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ క్యాంప్ ఆఫీసర్, డీఈఓ వాసంతికి దరఖాస్తులు చేశారు. 140కి పైగానే ఇలా దరఖాస్తులు రాగావాటిని క్షుణ్ణంగా పరిశీలించి కొందరు సాకుతో దరఖాస్తులు చేసినట్లు గుర్తించారు. అలాంటి వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లను గుర్తించి ఫోన్లు చేసి మంగళవారం కేంద్రానికి పిలిపించారు. తప్పనిసరిగా మూల్యాంకనం చేయాల్సిందేనని డీఈఓ వాసంతి ఆదేశించారు. దీంతో ఇక చేసేదేమిలేక కొందరు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. జెన్యూన్‌గా అనారోగ్య కారణాలు ఉన్న వారికి మినహాయింపు ఇచ్చారు. ఏయే సబ్జెక్టులలో తక్కువ ఉన్నారో వారి స్థానంలో అక్కడికి స్పాట్‌గా తమకు మూల్యాంకనం అవకాశం ఇవ్వాలని వచ్చిన ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకున్నారు. మరికొందరు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను కూడా విధుల్లోకి తీసుకున్నారు. దీంతో మంగళవారం వరకు సరిపడా ఉపాధ్యాయులతో మూల్యాంకనం ప్రక్రియ కొనసాగింది. ఫాతిమా హైస్కూల్‌లో 24 గదుల్లో ఈ మూల్యాంకనం ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతీ గదిలోనూ సీసీ కెమెరాల నిఘా ఉంది. డీఈఓ వాసంతి మంగళవారం ఆయా గదులను సందర్శించి పర్యవేక్షించారు. ఆ సమయంలో ముగ్గురు టీచర్లు సెల్‌ఫోన్లు వినియోగిస్తుండగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. బుధవారం నుంచి ఎవరైనా టీచర్లు సెల్‌ఫోన్‌లు వినియోగిస్తే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం.

స్పాట్‌కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర అబ్జర్వర్

ఫాతిమాహైస్కూల్‌లోని టెన్త్‌స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని రాష్ట్ర అబ్జర్వర్ విజయలక్ష్మీబాయి మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. వారికి కల్పిస్తున్న సదుపాయాలు ఎలా ఉన్నాయో కూడా పరిశీలించారు.

కబ్జా నిరూపిస్తే రాజీనామా చేస్తా

- పల్లా, తాటికొండలు క్షమాపణ చెప్పాలి
- ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడైనా ఒక్క గుంట భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవునూరు గుట్టల అటవీభూమిలో తాను రెండు వేల ఎకరాలని ఓసారి, 50 ఎకరాలు కబ్జా చేశానని మరోసారి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాటికొండ రాజయ్యలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను కబ్జా చేసినట్లు సాక్ష్యాలు, ఆధారాలతో ప్రజల ముందుంచితే వారి ఇద్దరి ఇళ్లలో గులాం చేయడానికి సిద్ధమని, లేదంటే వారిద్దరు నా ఇంట్లో గులాంగా పని చేయాలని సవాల్ విసిరారు. ఆరోపణలు చేసిన నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే న్యాయపరంగా చర్యలు వెనుకాడేది లేదని హెచ్చరించారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రామకృష్ణ, బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, పల్లకొండ సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్‌తో పశువులకు ముప్పు

- కేవీకే శాస్త్రవేత్త రాజన్న



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ రాజన్న

మామునూరు: అధిక పాల దిగుబడి కోసం విచక్షణారహితంగా యాంటీ బయాటిక్స్ వినియోగిస్తే పశువులు, ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని మామునూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ రాజన్న అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే, సద్గురు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'యాంటీ మెక్రోబియల్ నిరోధకత– పరిష్కారాలు' అనే అంశంపై పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం డాక్టర్ వంశీకృష్ణ యాంటీ బయాటిక్స్ వినియోగం, వాటి మోతాదు, ఎక్కువ వాడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు పశువుల పాకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షెడ్లు నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన విషయాలపై డాక్టర్ అమృత్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వరప్రసాద్, కైలాశ్, సాయికిరణ్, శాస్త్రవేత్తలు, పాడి రైతులు పాల్గొన్నారు

రూ.10 లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న నర్సంపేట రూరల్ సీఐ సాయి రమణ, నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్

నల్లబెల్లి: మహారాష్ట్రలోని ముంబాయికి తరలిస్తున్న సుమారు రూ.10 లక్షల విలువైన 21 కిలోల ఎండు గంజాయి పట్టుకుని ఇద్దరి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ, నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నల్లబెల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ముంబాయికి చెందిన ప్రవీణ్ శివబాదర్గే, వర్ష శంబాజీ కటే..రైలులో ఒడిశాలోని బరంపూర్ వెళ్లి సుమారు రూ.10లక్షల విలువైన 21.73 కిలోల ఎండు గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం రైలులో బరంపూర్ నుంచి మహబూబాబాద్ మీదుగా ముంబాయి బయలుదేరారు. మహబూబాబాద్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలుసుకుని రైలు దిగి ఓ వాహనంలో నల్లబెల్లి మీదుగా వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని నారక్కపేటలో జాతీయ రహదారిపై ఎస్సై గోవర్ధన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. గమనించిన నిందితులు పరారయ్యేందుకు యత్నించగా పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 21.73 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు రూరల్ సీఐ, ఎస్సై పేర్కొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

మంట వేడికి కోళ్లు మృత్యువాత

- రూ. 4. 50 లక్షల నష్టం
- ఆరెపల్లి శివారులోని పౌల్ట్రీ ఫామ్‌లో ఘటన



మృత్యువాత పడిన కోళ్లను పరిశీలిస్తున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి శివారులో మొక్కజొన్న సొప్ప కాలుతూ పౌల్ట్రీ ఫామ్ పక్కకు అంటుకోగా ఆ మంట వేడికి లక్షలాది రూపాయల విలువైన కోళ్లు మృత్యువాత పడ్డాయి. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పరకాల రాజేందర్ ఆరెపల్లి గ్రామ శివారులో పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ ఫామ్ పక్కన గంగుల పులమ్మ వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని శాయంపేటకు చెందిన దుంపల రాజిరెడ్డి కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. పంట కోసిన తర్వాత ఎండిన సొప్పను మంగళవారం తగులబెట్టగా కాలుతూ పౌల్ట్రీ ఫామ్ పక్కకు అంటుకుంది. మంట వేడికి సుమారు 1,500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. వీటి విలువ రూ.4లక్షల 50వేలు ఉంటుంది. ఈ ఘటనపై రాజేందర్.. రాజిరెడ్డిని పెద్దమనుషుల ద్వారా అడిగించగా.. 'నా భూమిలో సొప్ప కాల్చుకున్నా.. మంట మీ దగ్గరకు వస్తే మీరే ఆర్పుకోవాలి.. నాకు సంబంధం లేదు' అని సమాధానం ఇచ్చాడు. ఈ విషయంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. కాగా, రాజిరెడ్డికి తన చేనులోకి వెళ్లడానికి దారి లేదని, తాము కొన్నిసార్లు తమ పౌల్ట్రీ ఫామ్ నుంచి వెళ్లొద్దని చెప్పామని, దీంతో మనస్సులో పెట్టుకుని కావాలనే మక్క సొప్పను తగులబెట్టి కోళ్లు మృత్యువాత పడేలా చేశాడని రాజేందర్ ఆరోపించాడు.

అదుపు తప్పి ఆటో బోల్తా..

- ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- కాచికల్ శివారులో ఘటన



ఘటనాస్థలిలో ఆటో

నెల్లికుదురు: విద్యార్థులను తీసుకెళ్తున్న ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కాచికల్ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన 14 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్నారు. గతంలో తొర్రూరు నుంచి నెక్కొండ వరకు వయా కాచికల్, ఎర్రబెల్లిగూడెం, మేచరాజుపల్లి, బూర్గుమళ్ల, కల్లెడ, పర్వతగిరి మీదుగా నడిచిన ఆర్టీసీ బస్సులు ప్రస్తుతం రద్దు అయ్యాయి. దీంతో ఆర్టీసీ బస్సులు లేని కారణంగా తల్లిదండ్రులు ప్రైవేట్ వాహనాల్లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పాఠశాలకు ఆటోలో వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం తిరిగి అదే ఆటోలో ఇంటికి వెళ్తున్నారు. ఆటో కాచికల్ శివారులోని ప్రధాన రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు ముద్రాల అక్షిత్, యాటగాని హర్షిత్, సాయి చరణ్‌తో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించి ఇలాంటి ప్రమాదాలను నివారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉద్విగ్న క్షణాలు..





పట్టాలు అందుకుంటున్న వైద్య విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ నందకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ

యువ వైద్యులు సేవాభావంతో ముందుకు సాగాలి

- కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి
- కేఎంసీలో విద్యార్థులకు పట్టాల ప్రదానోత్సవం

ఎంజీఎం : ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని వైద్య వృత్తిలోకి ప్రవేశిస్తున్న యువ వైద్యులు వృత్తిని సేవాభావంతో కొనసాగిస్తూ పేదలకు బాసటగా నిలవాలని కాళోజీ హెల్త్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నందకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కాకతీయ మెడికల్ కళాశాల 61 గ్రాడ్యుయేషన్ డే కనుల పండువగా నిర్వహించారు. విద్యార్థుల పట్టాల ప్రదానోత్సవానికి తల్లిదండ్రులతోపాటుబంధుమిత్రులు పెద్ద ఎత్తున రావడంతో కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. వైద్యవిద్యలో ఓ ఘట్టం పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ బంధుమిత్రులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. 2019లో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందిన 230 మంది విద్యార్థులు ఈ సందర్భంగా పట్టాలు పొందారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు పెట్టాలి..

వైద్యవిద్యలో ఎంబీబీఎస్ మొదటి ఘట్టం మాత్రమేనని, వైద్యులు నిరంతర విద్యార్థులని వీసీ పేర్కొన్నారు. ఎంబీబీఎస్ అనంతరం తమ లక్ష్యాల మేరకు పోస్టు గ్రాడ్యుయేషన్ సాధించి ఉన్నత వైద్యులుగా ఎదగాలని ఆశించారు. ప్రస్తుతం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పరుగులు పెడుతూ వైద్యవిద్యనభ్యసించాలని వర్సిటీ రిజిస్ట్రార్ సంధ్యాఅనిల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్ రెడ్డి, రాజేశ్వరి, విజయలక్ష్మి, మధుసూదన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేయూ దూరవిద్య ప్రాక్టికల్స్

కేయూ క్యాంపస్ : కేయూపరిధి లోని దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ బీఎస్సీ, ఎంఎస్సీ సీఎస్ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు (2023–2024) ఈనెల 9,10,11 తేదీల్లో ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహిస్తున్నామని దూర విద్యకేంద్రం డైరెక్టర్ సురేశ్‌లాల్, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటగోపినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కంప్యూటర్‌సైన్స్, గణితం, స్టాటిస్టిక్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 12,13,14 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరై ప్రాక్టికల్స్ పరీక్షలు రాయాలని కోరారు.

'యూత్ పార్లమెంట్'లో కేయూ విద్యార్థిని ప్రతిభ

- అభినందించిన వీసీ, రిజిస్ట్రార్



శ్రీజజాదవ్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కేయూ క్యాంపస్ : ఢిల్లీలోని పార్లమెంట్‌లో ఈనెల 1నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ యూత్ పార్లమెంట్ వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై కేయూ బయోటెక్నాలజీ ఫైనలియర్ విద్యార్థిని శ్రీజాజాదవ్ పాల్గొని అనర్గలంగా ప్రసంగించారు. 'ట్రాన్సిషనల్ మోడల్స్ ఇంప్లిమెంటేషన్ మార్గాలు' అనే అంశంపై ప్రసంగించి ప్రతిభ చాటారు. మంగళవారం శ్రీజాజాదవ్ కాకతీయ యూనివర్సిటీకి రాగా ఆమెకు విద్యార్థులు, కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, పలువురు అధ్యాపకులు మొదటిగేట్‌వద్ద స్వాగతం పలికి బయోటెక్నాలజీ విభాగం వరకు ర్యాలీ నిర్వహించారు. గజమాలతో సన్మానించారు. అనంతరం వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం.. శ్రీజాజాదవ్‌ను పరిపాలనాభవనంలో అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి. మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ కె. మమత, బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు టి.శాస్త్రి, శ్రీనివాస్, కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, ఆర్ట్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో ఆర్టీసీ డ్రైవర్ల విధులు

- ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం విజయభాను



ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందజేస్తున్న ఆర్‌ఎం, అధికారులు

హన్మకొండ: ప్రయాణికులను క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ ఆర్టీసీ డ్రైవర్లు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను కొనియాడారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో జరిగిన కార్యక్రమంలో రీజియన్‌లో 2024 అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వృత్తిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం విజయ భాను ముఖ్య అతిథిగా పాల్గొని రీజియన్‌లోని 9 డిపోలలో ఎంపిక చేసిన ఉత్తమ ఉద్యోగులకు జ్ఞాపిక, ప్రశంస పత్రం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీలోనూ ఆర్టీసీ ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని మిగతా వారు పోటీ పడాలన్నారు. ఇదే ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. మరింత ఆదాయం తీసుకురావాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు కేశరాజు భాను కిరణ్, మహేశ్, డిపో మేనేజర్లు, సూపర్ వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు

- డ్రోన్ ద్వారా పోల్ సర్వే చేయాలి
- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ : పట్టణ ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు సరిపడా స్థలాలు లేవని, ఇండోర్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్, కరీంనగర్‌లో ఇండోర్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరముందని ఆయన తెలిపారు. మంగళవారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో హనుమకొండ సర్కిల్(జిల్లా) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్, సెక్షన్ల వారీగా ప్రగతిని సమీక్షించారు. దేవునూరు, క్యాతంపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న 11 కేవీ లైన్ల వివరాలు అడిగి తెలుసుకుని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ పనిలో సాంకేతికను వినియోగించాలని సూచించారు. డ్రోన్ ద్వారా పోల్ టు పోల్ సర్వే చేయించి గుర్తించిన సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భవిష్యత్‌లో ఎక్కడైనా విద్యుత్ లైన్ వేసేందుకు అనుకూలం లేని ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కేబుల్ వేస్తామని వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాలతో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఒక సబ్ స్టేషన్ నుంచి మరో సబ్ స్టేషన్‌కు విధిగా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు కాకుండా విధిగా టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకోవాలని, 60శాతం కంటే లోడ్ పెరిగే అవకాశం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యంగా డీఈలను (టెక్నికల్) సేఫ్టీ అధికారులుగా నియమించామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, తిరుమల్ రావు, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, ఎస్ఈలు, డీఈలు,ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం

విద్యుత్ ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో హనుమకొండ జిల్లాలోని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు, ఆర్టిజన్ సిబ్బందితో నేరుగా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతకు పెద్దపీట వేసి సర్కిల్ కార్యాలయం టెక్నికల్ డీఈలను సేఫ్టీ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. అదే విధంగా రూ.కోటి బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణం పరిశీలన



అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

సాక్షి ఎఫెక్ట్..

తరిగొప్పుల: ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణంపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'సెలవు రోజుల్లోనే పనులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని జిల్లా పంచాయతీ అధికారి నాగపూరి స్వరూప మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేపడుతుంటే ఏం చేస్తున్నావని పంచాయతీ కార్యదర్శి అమనగంటి మహేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్‌ను సంప్రదించి పూర్తి నివేదిక అందించాలని సూచించారు. అనంతరం అబ్దుల్ నాగారం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ మాలతి ఉన్నారు.

కంప్యూటర్ల అందజేత



సంస్థ ప్రతినిధులతో విద్యార్థులు, టీచర్లు

చిల్పూరు: విద్యాభివృద్ధి కోసమే పాఠశాలకు కంప్యూటర్లు, విద్యార్థులకు కావాల్సిన వస్తువులు అందజేయడం జరిగిందని మాకిన్ సంస్థ డైరెక్టర్ ఆఫ్ హెచ్‌ఆర్ మేనేజర్ సుధీర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మాకిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు సామాజిక బాధ్యతలో భాగంగా రూ.2 లక్షల విలువైన నాలుగు కంప్యూటర్లు, ప్రింటర్లు, విద్యార్థులకు స్నాక్స్, బ్యాగులు, కామిక్ బుక్స్‌ను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజేందర్, వెంకటేశ్వర్లు, విక్రమ్, యాదగిరి, గోపాలకృష్ణ, జుబేద, దుర్గ, స్వప్నతోపాటు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రంలోని తిరుమలనాథ దేవస్థాన చైర్మన్‌గా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన నీల నర్సింహులుముదిరాజ్ నియామకమయ్యారు. ఈ మేరకు దేవస్థాన నూతన కమిటీని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా నీల నర్సింహులు, వైస్ చైర్మన్‌గా తాటికొండ యాదగిరి, డైరెక్టర్లుగా గట్టు ప్రశాంత్, పిట్ట లక్ష్మీనారాయణ, మునిగెల కుమారస్వామి, గోనెల ఎల్లయ్య, చెరిపెల్లి రాములు, గుంటి శేఖర్, గట్టు శ్రీవాణివెంకటస్వామి, గొరిశెట్టి శ్రీనివాస్ నియమితులయ్యారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

జనగామ రూరల్: పట్టణంలో ధర్మకంచ ఓపెన్ జిమ్ పక్కన అక్రమంగా నిర్మించిన రేకుల ఇళ్లను తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను ఆయన సందర్శించి మాట్లాడారు. జిమ్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఇద్దరు మహిళలు అక్రమంగా ఇళ్లను నిర్మించారని వాటిని వెంటనే అధికారులు తొలగించాలని కోరారు. బూడిది గోపి, బొట్ల శ్రావణ్, పల్లెర్ల లలిత, పాము శ్రీకాంత్ ఉన్నారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామంలో నేటి నుంచి నిర్వహించనున్న ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి పండుగకు సంబంధించి గ్రామ శివారులోని పెద్దమ్మతల్లి దేవాలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. దేవాలయానికి రంగులు వేయడంతో పాటు భక్తుల సౌకర్యం కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పిట్టల శ్రీనివాస్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బుధవారం నుంచి పెద్దమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయన్నారు. ఆలయ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, యాకయ్య, అశోక్, ఐలయ్య, రాములు, శ్రీనివాస్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

కొడకండ్ల: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కొడకండ్ల మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనిస్తూ రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరను పెంచి భారం మోపడం.. పేదలపై బీజేపీ ప్రభుత్వానికి ఉన్న కపట ప్రేమ స్పష్టమవుతుందన్నారు. మార్కెట్ డైరెక్టర్‌లు నాగరాజు, వెంకన్న, క్రాంతికుమార్, నారెడ్డి వెంకట్‌రెడ్డి, యాకూబ్ పాల్గొన్నారు.

కొందరికే 'ఉపాధి' పనులు

- పనుల కుదింపే ఇందుకు కారణం
- అవస్థలు పడుతున్న కూలీలు
- పట్టించుకోని ప్రభుత్వం, సంబంధిత అధికారులు



అల్వార్‌బండాతండా గ్రామ శివారులో తక్కువ మంది కూలీలతో చేపడుతున్న ఉపాధి పనులు

జఫర్‌గఢ్: రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి కూలీలది. ఒకవైపు వ్యవసాయ పనులు లేక.. మరోవైపు ఉపాధి పనులు దొరకక కూలీలు అవస్థలు పడుతున్నారు. ఎక్కువ మంది కూలీల ద్వారా చేపట్టాల్సిన ఉపాధి పనులను ప్రభుత్వం ఇటీవల కుదించి కొద్దిమందికే పని కల్పిస్తోంది. దీంతో ఎక్కువ రోజుల పనిదినాలు కూడా లభించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు పనులు కల్పించాలని కూలీలు సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామాల్లో ఉపాధి పనుల కోసం కూలీలు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికి మండలంలో మొత్తం ఉపాధి పథకానికి సంబంధించిన 9 వేల 757 జాబ్ కార్డులు ఉండగా 19 వేల 429 మంది కూలీలు ఉన్నారు. ఒక్కో గ్రామంలో కనీసం 150 నుంచి 400 మందికి పైగా ఉపాధి కూలీలు ఉన్నారు.

260 రకాల పనులకు 16కు కుదింపు

ప్రభుత్వ నిబంధనల మేరకు జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీ కుటుంబానికి వంద రోజుల పాటు పని దినాలు కల్పించాల్సి ఉండగా ప్రభుత్వం ఇటీవల ఉపాధి హామీ పనులను మధ్యలోనే తొలిగించడంతో వారికి పని దొరకడం లేదు. ఉపాధి హామీకి సంబంధించి మొత్తం 260 రకాల పనులు ఉండగా 40 మాత్రమే కొన్నేళ్లుగా చేపడుతున్నారు. ఇందులో ఒక్కొక్కటిగా పనులను తగ్గిస్తూ వచ్చిన ప్రభుత్వం 16 రకాల పనులకు కుదించారు. వాటిని ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సి ఉండగా.. వాటినీ తగ్గిస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో ప్రధానంగా చెరువుల పూడిక తీత, జంగిల్ కటింగ్, ల్యాండ్ లెవలింగ్, రాళ్ల తీయడం, ఫీడర్ ఛానళ్ల పూడికతీత వంటి పనులను పూర్తిగా తొలిగించారు. కేవలం రైతులకు సంబంధించి పంట పొలాల్లో పనులు, మట్టి కట్టలు, మట్టి రోడ్లు, చిన్న ఊట కుంటలు, గుట్టలపై గుంతలు, కందకాలు, చేపల చెరువులను నిర్మించడం వంటివి మాత్రమే చేపట్టాల్సి రావడంతో ఈజీఎస్ సిబ్బంది ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించలేకపోతున్నారు. కేవలం 8 రకాల పనులు మాత్రమే గ్రామాల్లో చేపడుతున్నారు. ఈ పనులకు కూడా పూర్తి స్థాయిలో తీర్మానాలు లేకపోవడంతో అవి చేపట్టడంలో జాప్యం జరగడంతో పాటు తక్కువ మంది కూలీలచే సరిపెట్టాల్సి వస్తోంది. దీంతో ఉపాధి పనుల కోసం ప్రతీ రోజు ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామపంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడం.. మరోవైపు ఉపాధి పనులు దొరకక కూలీ పనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది.

పనులు కల్పించి ఆదుకోవాలి



గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకుండా పోయాయి. కూలీందరికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా కేవలం కొద్ది మందితో తక్కువ రోజుల పాటు పనులు చేయిస్తున్నారు. ఎక్కువ మంది కూలీలు చేసే పనులను తొలిగించడం వల్ల అందరికి పని దొరకడం లేదు. పనులు కల్పించాలని ఎవరికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కూలీందరికి పనులు కల్పించి ఆదుకోవాలి.

-లకావత్ వసుంధర్, ఉపాధి కూలీ

అందరికీ పని కల్పిస్తాం..

ఉపాధి హామీ పథకం ద్వారా కూలీందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా రైతులు తమ పంట పొలాల్లో ఒక గుంట భూమిలో (సేద్యపు) నీటి కుంటలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలి. దీనివల్ల కూలీలకు పని దొరకడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- రాజకరుణ, ఏపీఓ

కొనసాగుతున్న కాంగ్రెస్ శ్రేణుల పాదయాత్ర



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్

జనగామ రూరల్/బచ్చన్నపేట/నర్మెట: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ నినాదంతో కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన పాదయాత్ర పలు గ్రామాల్లో కొనసాగుతోంది. మంగళవారం పలు గ్రామాల్లో నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై అనేక కుట్రలు చేస్తూ మార్చాలని చూస్తోందని..దానిని కాపాడుకోవాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'కడియంను విమర్శిస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న రమేశ్

జనగామ: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తే ఊరుకోమని డీసీసీ కార్యదర్శి మంద రమేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కడియంపై చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మచ్చ లేని నాయకుడిగా ఉన్న కడియంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. శ్రీహరి భూమి ఎక్కడ కబ్జా చేశారో ఎమ్మెల్యే పల్లా నిరూపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనగామ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ డి.అంజిరెడ్డి, రఘునాథపల్లి ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రచ్చ సోమనాథ్, రఘునాథపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీడికంటి రాజ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు సూర్యప్రకాశ్, మడికంటి రమేష్ పాల్గొన్నారు.

ఆలయ భూమి సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన భూమిని దేవాదాయ శాఖ ఏడీ మన్నెంకొండ మంగళవారం రెండోసారి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఆలయానికి 229 ఎకరాల భూమి ఉండగా అందులో కొంత అన్యాక్రాంత అయినట్లు తెలిసినందున సర్వే నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. పూర్తి స్థాయి సర్వే అనంతరం వివరాలను వెల్లడిస్తామన్నారు. తహసీల్దార్ సరస్వతి, ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు, ధర్మకర్తలు రమేష్, రాజు ఉన్నారు.

తప్పిపోయిన మహిళ అప్పగింత



మహిళను భర్తకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ కృష్ణ

లింగాలఘణపురం: 45 రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా జల్పల్లి సబితా ఇంద్రారెడ్డి కాలనీకి చెందిన గీత అనే 24 ఏళ్ల మహిళను ఎట్టకేలకు ఈ నెల 7వ తేదీన ఆమె భర్త సైదులుకు పోలీసుల సహకారంతో సఖీ కేంద్రంలో అప్పగించారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 29వ తేదీన లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల బ్రిడ్జి వద్ద తిరుగుతున్న ఆమెను పోలీసులు జనగామ సఖీ కేంద్రానికి తరలించారు. ఆమె అప్పటికే ఓ పాపకు జన్మనివ్వడం, ఆ పాప చనిపోవడంతో అనారోగ్య సమస్యలతో తిరుగుతూ ఉంది. ఆమె పరిస్థితిని గమనించిన పోలీసులు ఆమె వద్ద ఉన్న డెలివరీకి సంబంధించిన ఓ పేపర్‌తో అక్కడి వివరాలు సేకరించి సోషల్ మీడియా తదితరాల్లో ప్రచారం చేశారు. దీంతో ఆమె భర్త సైదులు గుర్తించి జనగామ సఖీ కేంద్రంలో ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ నెల 7వ తేదీన గీతను ఆమె భర్త సైదులుకు సఖీ కేంద్రం ఆధ్వర్యంలో ఆమె అంగీకారంతో అప్పగించారు. పది రోజుల పాటు జనగామ సఖీ కేంద్రంలో వైద్య చికిత్సలు చేయిస్తూ ఎంతో ఆందోళనతో ఉండగా భర్త గుర్తించి రావడం, అటు పోలీసుల కృషి, సఖీ కేంద్రం సేవలు ఫలించడంతో భర్తకు చేరువైంది. దీంతో సఖీ, పోలీసు సేవలను ప్రజలు అభినందించారు.

కరపత్రాల ఆవిష్కరణ



జనగామ రూరల్: ఈనెల 14వ తేదీన ఆదిలాబాద్ డైట్ కాలేజ్ గ్రౌండ్‌లో చేపట్టనున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర, ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు పాదయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలను జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. నాయకులు సందీప్, ఉమ, రాజు, రవికుమార్, రవళి పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

పాలకుర్తి టౌన్: వల్మిడి సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్ నాయకుడు, వల్మిడి మాజీ సర్పంచ్ కత్తి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వల్మిడి సీతారామచంద్రాస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి దయాకర్‌రావును బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించపోవడాన్ని ఖండించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

కొడకండ్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, నిరుపేదల సంక్షేమం కోసమే ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. మంగళవారం మొండ్రాయిలో సన్నబియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్ నాగరాజు, నాయకులు మల్లేష్, యాదగిరి, వెంకన్న, రాంకుమార్, నరేందర్, శ్రీకాంత్, భిక్షం, శోభ, ధనమ్మ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

నర్మెట: మద్యం సేవించి ద్విచక్రవాహనం నడిపిన వ్యక్తికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష, రూ. 500 జరిమాన విధించినట్లు ఎస్సై నైనాల నగేష్ మంగళవారం తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలకేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా లక్ష్మీతండాకు చెందిన బానోత్ రవి మద్యం చేవించినట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసి పీసీ కెంగెర్ల రమేష్ కోర్టులో హాజరుపరిచారు. కాగా, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట రాంనర్సయ్య శిక్ష విధించగా రవిని జైలుకు తరలించారని ఆయన తెలిపారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

కొడకండ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి గాను టీజీఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తమ్మిదిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో ఇంటర్ ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదలైందని, 2025 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులు చేసుకున్న వారికి మే 10వ తేదీన జిల్లా కేంద్రంలో రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కొడకండ్లలోని తెలంగాణ రాష్ట్ర జనరల్ గురుకులంలో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో అవకాశం ఉన్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కంచనపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంకు ఖాతా నంబర్, ఓటీపీ చెప్పాలని ఫోన్ చేసి అడిగితే స్పందించొద్దన్నారు. మొబైల్ నంబర్‌కు లాటరీ వచ్చిందని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ బారిన పడితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేసుకోవాలన్నారు. ఎస్సై దూదిమెట్ల నరేష్, ఏఎస్సై కట్టమల్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత

బచ్చన్నపేట: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేత అన్నారు. మంగళవారం కట్కూర్, బండనాగారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుందన్నారు. మధ్య దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి రైతులు మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, సీఈఓ కాశ బాలస్వామి ఉన్నారు.

హర్షణీయం

పాలకుర్తి టౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పెట్టిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడం హర్షణీయమని తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక జిల్లా కన్వీనర్ పోలస సోమయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మీడియాతో ఆయన మాడారు. గత ప్రభుత్వాలు వందలాది మంది తెలంగాణ ప్రజలపై అక్రమ కేసులు బనాయించి కుటుంబాలని విధ్వంసం చేశాయని అన్నారు. ఇప్పటికైన సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడి ప్రజలపై ఉన్న అన్ని కేసులను రద్దు చేసి, పోరాడిన వారిని తెలంగాణ రాష్ట్ర సాధన సమర యోధులుగా గుర్తించి తగిన సహకారాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

వ్యవసాయాన్ని పండుగ చేసింది కేసీఆరే

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నర్మెట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

నర్మెట: దండగన్న వ్యవసాయాన్ని గోదావరి జలాలతో పండుగ చేసి రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపిన అపర భగీరథుడు కేసీఆరేనని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని వినాయక గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. ఉమ్మడి మండలాల అధ్యక్షులు చింతకింది సురేష్, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్రనాయకులు గద్దల నర్సింగారావు, ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, తాజా మాజీప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయించడం పిరికిపంద చర్య

జనగామ రూరల్: బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం పిరికిపంద చర్య అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ దళిత నాయకుడు తిప్పారపు విజయ్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపడాన్ని అయన మంగళవారం తీవ్రంగా ఖండించారు. అక్రమ కేసులకు వత్తాసు పలికితే పోలీసులపై చర్యలను తీసుకోవడానికి న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని అన్నారు.

సేంద్రియ వ్యవసాయం చాలా బాగుంది

- ఆదర్శ రైతు మంతపురి యాదగిరి



రాజస్థాన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న ఆదర్శ రైతు యాదగిరి

రఘునాథపల్లి: రాజస్థాన్ రాష్ట్రం మౌంట్ అబునందు సేంద్రియ వ్యవసాయ విధానం చాలా బాగుందని మండలంలోని కన్నాయపల్లి గ్రామానికి చెందిన ఆదర్శరైతు మంతపురి యాదగిరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో శాశ్వత యోగిక్ అగ్రికల్చర్ అనే అంశంపై నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణలో ఆయన పాల్గొని మంగళవారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీన తనతో పాటు జిల్లా నుంచి మరో ఇద్దరు రైతులు శిక్షణ పొందారన్నారు. శిక్షణ పొందే అవకాశం ఇచ్చిన ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడి విధానాలు తెలంగాణలో అమలయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడంతో పాటు స్వచ్ఛమైన ఆహారాన్ని అందిస్తారని ఆయన పేర్కొన్నారు.

'దేశం అన్నిరంగాల్లో పురోగతి'



సమావేశంలో పాల్గొన్న దశమంతరెడ్డి, నాయకులు

జనగామ రూరల్: ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. మంగళవారం మండల క్రియాశీల సభ్యుల సన్నాహక సమావేశం స్థానిక గాయత్రి గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీనివాస్, ఉపేందర్, మండల మహేందర్, అనిల్, మహిపాల్ పాల్గొన్నారు

పంచాయతీ కార్మికుడికి ఆర్థికసాయం



చికిత్స పొందుతున్న నాగరాజు

రఘునాథపల్లి: విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న పంచాయతీ కార్మికుడు వేల్పుల నాగరాజుకు మేకలగట్టు గ్రామం అండగా నిలుస్తోంది. ఆపదలో ఉన్న పంచాయతీ కార్మికుడికి మంగళవారం ఆర్థిక సాయమందించింది. గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు నాగరాజు ఈ నెల 5న గ్రామంలో వీధిలైట్లు వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలతో హన్మకొండ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. గ్రామానికి సేవ చేస్తున్న నాగరాజుకు తమ వంతు గ్రామస్తులు చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు. గ్రామ వాట్సాప్‌గ్రూపు ద్వారా రూ. 60 వేలు సేకరించి బాధిత కుటుంబానికి అందించారు. సాయం అందించిన వారిలో గ్రామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూ 5,500, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూ 3,500, మాజీ సర్పంచ్ గడ్డమిది సంధ్యారాణికిరణ్ రూ.3 వేలు , గుండె యాదగిరి రూ.3 వేలు, ఇల్లెందుల ప్రకాశ్ రూ.2 వేలు, ముక్క పరశురాములు రూ.2 వేలు, బానోత్ లింగమూర్తి రూ 2 వేలు, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా

గుండెపోటుతో పోస్టుమన్ మృతి

లింగాలఘణపురం: జనగామ మండలంలోని మరిగడిలో పోస్‌మన్‌గా పనిచేస్తున్న కళ్లెం గ్రామానికి చెందిన ఎండీ యాకుబ్‌పాషా (35) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకుబ్‌పాషా మరిగడిలో ఐదేళ్లుగా పోస్టుమెన్ ఉద్యోగం చేస్తూ కళ్లెం నుంచి వెళ్లి వస్తున్నాడు. సోమవారం ఆలేరులో జరిగిన బంధువుల శుభకార్యానికి వెళ్లి తిరిగి వచ్చాడు. రాత్రి సమయంలో ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పి వాంతులు చేసుకోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు జనగామకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

మైక్‌సెట్ బహూకరణ

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి బొడ్రాయి సమీపాన ఉన్న అభయాంజనేయస్వామి ఆలయానికి బీజేపీ మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ బూర్ల విష్ణు తన వంతుగా మంగళవారం మైక్‌సెట్‌ను బహూకరించారు. తోట సురేందర్, కె.శరత్‌కుమార్, బీష్మాచారి, ఉపేందర్, సోమయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ పిలుపునిచ్చారు. తమ్మడపల్లి (ఐ) గ్రామంలో సీపీఐ గ్రామ మహాసభను సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ మహాసభకు పార్టీ నాయకులు మంద బుచ్చయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం దారుణమన్నారు. అనంతరం పార్టీ గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

దేవరుప్పుల: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి కె.లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ కళావతి అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలల్లోని 1,859 మంది విద్యార్థులకు కావాల్సిన యూనిఫామ్‌క్లాత్‌ను ఐకేపీ ద్వారా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు అందజేశారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణు, రాజేంద్ర కుమార్, ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, చందన మండల సమాఖ్య ప్రతినిధి సంధ్య, టైలర్స్ బాధ్యులు ఉన్నారు

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

చిల్పూరు: నష్కల్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు కోతి వీరస్వామి మంగళవారం తాటి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన వీరస్వామి మంగళవారం మధ్యాహ్నం కల్లుగీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

దేశభక్తిని కలిగి ఉండాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే దేశ సమైక్యత, దేశభక్తిని కలిగి ఉండాలని తాటికొండ జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం లింగమూర్తి అన్నారు. ఆ పాఠశాలలో ఏక్‌భారత్–శ్రేష్ఠభారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మాట్లాడారు. ఏఏపీసీ చైర్మన్ బేతి మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల తోడ్పాటును పల్లె ప్రజలు మరువరు

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలలో అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల తోడ్పాటును పల్లెప్రజలు ఎన్నటికీ మరువరని మండల విద్యాధికారి జి.కళావతి అన్నారు. మంగళవారం చిన్నమడూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేసి వెళ్లిన ఉపాధ్యాయులు రమేష్‌బాబు, నర్సింహనాయక్, రమాదేవి, బుచ్చమ్మ, లక్ష్మీకాంతమ్మ, వరలక్ష్మీలను ప్రస్తుత హెచ్‌ఎం మాధవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

కమిటీ ఎన్నిక

జనగామ రూరల్: గానుగుపహాడ్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సభ్యుల ఆమోదంతో అధ్యక్షుడిగా ఇరుగు సిద్ధులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే జనరల్ సెక్రెటరీగా గుర్రం నగేష్, ఉపాధ్యక్షులుగా సుద్దాల రాజు, కార్యదర్శిగా గుర్రం మల్లయ్య, కోశాధికారిగా గుర్రం సదానందం ఎన్నికయ్యారు.